వరదొస్తే కనపడదంట..!

- ఉధృతంగా ప్రవహిస్తున్న వరద
- బిక్కుబిక్కుమంటున్న లంక రైతులు
- ముంచెత్తితే భారీ నష్టం


వరద కారణంగా లంకల్లోని పశువులను గట్టుకు చేర్చిన దృశ్యం

కె.గంగవరం: గోదావరికి వరదల సీజన్ వచ్చేసింది. ఏటా గోదావరి నదికి వరదలు రావడంతో గట్టుకు అటు, ఇటువైపు ఉన్న గ్రామాలు, లంక రైతులకు కంటిమీద కునుకు ఉండదు. ఏటిగట్టు బలహీనంగా ఉండటంతో వరద సమయంలో గట్టు తెగిపోతుందేమోనని గోదావరి పరివాహక ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతుంటే.. మరోవైపు కుటుంబ పోషణ నిమిత్తం లంక పొలాలను కౌలు సాగు చేస్తున్న రైతులకు వరదతో నష్టపోతామోమోనని ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం గోదావరి వరద ఉధృతంగా ప్రవహిస్తుండటంతో కంటికి రెప్పలా కాపాడుకుంటున్న పంటలను వరద ఏ క్షణంలో ముంచెత్తుతుందని భీతిల్లుతున్నారు. ఎగువ ప్రాంతాల్లో విస్తారంగా కురుస్తున్న వర్షాలు వారిని కలవరపెడుతున్నాయి.

కె.గంగవరం, కపిలేశ్వరపురం మండలాల్లో..

కె.గంగవరం మండలంలోని కూళ్ల నుంచి మసకపల్లి వరకు ఉన్న లంక భూముల్లో ఉద్యానవన పంటలు భారీగా పండిస్తున్నారు. మండల వ్యాప్తంగా ఏటా అరటి 190 ఎకరాల్లో, బొప్పాయి 30 ఎకరాల్లో, కూరగాయలు 165 ఎకరాల్లో పండిస్తుండగా.. కపిలేశ్వరపురం మండలంలో అద్దంకివారిలంక పరిధిలో కొబ్బరి 300 ఎకరాల్లో, అరటి 330 ఎకరాల్లో, కూరగాయలు 70 ఎకరాల్లో, కేదారిలంక పరిధిలో కూరగాయలు 270 ఎకరాల్లో, బొప్పాయి 80 ఎకరాల్లో, అరటి 458 ఎకరాల్లో, కొబ్బరి 200 ఎకరాల్లో పండిస్తున్నారు. ఈ భూములన్నీ సారవంతమైన భూములే. వేసవి కాలంలో కూడా నీటి వసతికి ఇబ్బంది లేదు. ఈ భూముల్లో రైతులు ప్రధానంగా కొబ్బరి, కోకో, అరటి, పసుపు, కంద, పుచ్చకాయ, మామిడి, కూరగాయలు, పందిరి కూరగాయలు, పూలతోటలు, బొప్పాయి, తమలపాకులు, మునగ, జామ వంటి పంటలు వేస్తుంటారు. కేవలం కూరగాయల పంట నుంచి కొంత ఆధాయం పొందినా, గోదావరికి వరదలు వస్తే మిగిలిన పంటలు ముంపు బారిన పడతాయని రైతులు చెబుతున్నారు. తాత్కాలిక పంటలైన కూరగాయలు, పూల తోటల నుంచి ఆదాయం లభించినప్పటికీ దీర్ఘకాలిక పంటలైన అరటి, కంద, పసుపు, తమలపాకులు, మునగ తోటలు ముంపులో చిక్కుకుని దెబ్బతింటున్నాయని చెబుతున్నారు. వరదల సమయంలోనే ఈ పంటలు దిగుబడికి వస్తాయి. గోదావరి కన్నెర్ర జేస్తే పెట్టిన పెట్టుబడితో సహా మొత్తం ఊడ్చుకుపోతుందని వివరిస్తున్నారు.


లంక పొలాల వద్ద అరటి, కొబ్బరి తోటలు


బోదిలంక వద్ద వరద ఉధృతికి మునిగిన బొప్పాయి తోట (ఫైల్)

పశుసంపద కూడా

లంక రైతులు ఉద్యాన పంటల సాగుతోపాటు, పాడి పశువులకు కూడా ప్రాధాన్యమిస్తారు. తమ పశువులను లంక పొలాల్లోనే మకాం వేసి ఉంచుతారు. అక్కడే వాటికి సరైన ఆహారం లభిస్తుంది.కానీ, వరదల సమయంలో పశువులను గట్టుకు చేరుస్తారు. అప్పుడు వాటికి సరైన ఆహారం లేక బక్కచిక్కుపోతాయి. దీంతో పాటు రాత్రికి రాత్రే గోదావరి ఉప్పొంగినప్పుడు పశువులు కూడా కొట్టుకుపోతాయి.

ఆ తర్వాత ప్రభుత్వం పంట నష్ట పరిహారం ఇచ్చిన అవి అసంపూర్తిగానే ఉంటాయి.

పంటలే జీవనాధారం

సాధారణంగా ఏటా జూలై 15 నుంచి సెప్టెంబర్ 15 వరకు గోదావరి నదికి వరదలు వస్తుంటాయి. ఈ నదికి ఉధృతంగా వచ్చే వరదలు సారవంతమైన లంక భూముల్లో సాగవుతున్న వివిధ రకాల ఉద్యాన, పూల తోటలను ముంచెత్తుతాయి. అందుకే ఈ ప్రాంతంలో లంక పంట.. గోదారి మేత అనే సామెత ఉంది. వరద వచ్చినప్పుడల్లా లంక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ సీజన్‌లో పంటలు వేయకుండా ఉందామంటే బతుకు తెరువు ఉండదని చెబుతున్నారు. కష్టమో.. నష్టమో లంకల్లో పండే పంటలే తమకు జీవనాధారమని పేర్కొంటున్నారు.

అప్పుడే పంట చేతికి వస్తుంది

పంట బాగా పండి, మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభిస్తున్న తరుణంలోనే గోదావరికి వరదలు వచ్చి తుడిచి పెట్టుకుపోతుంటా యి. వరద రాకపోతే పంట చేతికి దక్కుతుంది. ప్రస్తుతం బొప్పాయి తోట నాలుగు ఎకరాల్లో వేశాను. ఈ ఏడాది ఇంకా వరద రాలేదు. వచ్చినా మెట్ట ప్రాంత లంక భూములు కొంత బాగానే ఉంటాయి, కానీ, పల్లపు భూముల్లో పంట మొత్తం పోతుంది.

– కాదా గోవిందు, లంక రైతు, మసకపల్లి.

ముందు జాగ్రత్త అవసరం

ప్రస్తుతం వరద ఉధృతి ఇంకా లేదు. కూరగాయల సాగు చివరి దశలో ఉంది. మిగిలిన పంటల కు చెందిన రైతులు ముందు జా గ్రత్త వహించి తమ పంటలను అమ్ముకోవాలి. తగిన జాగ్రత్తలు పాటిస్తే వరద ఉధృతి నుంచి పంటలను కొంత వరకు కాపాడుకోవచ్చు.

– కోటేశ్వరరావు, ఉద్యానవన శాఖ అధికారి.

ఉగ్రరూపం దాల్చిన గోదావరి


కోటిపల్లి రేవులో షాపుల వద్దకు చేరిన వరద నీరు

కె.గంగవరం: మండలంలోని కూళ్ల నుంచి బ్రహ్మపూరి వరకు వరద గోదావరి ఉగ్రరూపం దాల్చింది. సముద్రంలోకి వరద నీరు కలిసేందుకు ఉరకలు వేస్తూ పవరళ్ల తొక్కుతుంది. గురువారం ఉదయం నుంచి గంట గంటకు గోదావరి పెరుగుతునే ఉందని స్థానికులు అంటున్నారు. వరద పెరగడంతో కొన్ని పశువులు ఇంకా లంక పొలాల్లో ఉండిపోవడంతో పంటు ఏర్పాటు చేసి గట్టుకు చేరుస్తున్నారు. ఈ రాత్రికి మరింత వరద వస్తుందని స్థానిక రెవెన్యూ అధికారులు చెప్పడంతో మత్స్యకార కాలనీలో ఆందోళన నెలకొంది.

నిలిపోయిన పంటు ప్రయాణం

వరద నీరు భారీగా వచ్చి చేరడంతో కోటిపల్లి- ముక్తేశ్వరం పంటు ప్రయాణాన్ని రెవెన్యు అధికారులు నిలిపివేశారు. రేవు దాటిన తరువాత ముక్తేశ్వరం వద్ద ఏర్పాటు చేసిన కంకర రోడ్డు గోదావరిలో కొట్టుకుపోయింది. దీంతో పాటు ఎన్నడూ లేని విధంగా రెండు తూరలు కూడా వరద ఉధృతికి కొట్టుకుపోవడంతో పంటు ప్రయాణానికి ఆటంకం కలిగింది.

చుట్టుముట్టిన వరద నీరు

కె.గంగవరంలోని మదవనగర్, హరినారాయణవారి వీధి, నూకాలమ్మ పేట వీధులను వరద నీరు చుట్టుముట్టింది. గోదావరి ఒడ్డునే ఉన్న పాకల్లోకి వరదనీరు చేరింది. గోదావరిలో ఉండే నాటు పడవలు ఇళ్ల ముందుకు వచ్చేశాయి.

ఇసుక బస్తాలతో గట్టు పటిష్టం

మండలంలోని కోటిపల్లి వద్ద ఉన్న ఏటిగట్టు బలహీనంగా ఉంది. గోదావరి ఉధృతి ఎక్కువగా ఉండడంతో గట్టు కోతకు గురైయ్యే విధంగా ఉంది. ఈ నేపథ్యంలో పీడబ్ల్యూడీ అధికారులు గట్టును పటిష్టం చేసేందుకు చర్యలు తీసుకున్నారు. ఇసుక బస్తాలు, కర్రలతో గట్టును పటిష్టం చేసి గస్తీని ఏర్పాటు చేశారు.

వరదతో అప్రమత్తంగా ఉండాలి


కపిలేశ్వరపురంలో వరద చర్యలపై చర్చిస్తున్న ఆర్డీఓ అఖిల


కేదారిలంకలో వరద నీటిని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి విజయలక్ష్మి

రామచంద్రపురం ఆర్డీఓ అఖిల

కపిలేశ్వరపురం: గోదావరి వరద ఉధృతంగా మారుతున్న నేపథ్యంలో ప్రభుత్వ శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని రామచంద్రపురం ఆర్డీఓ డి.అఖిల ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం వరద నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ఆర్డీఓ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. నియోజకవర్గ ప్రత్యేకాధికారి, జిల్లా సివిల్ సప్లయిస్ డీఎం పి.శ్రీనివాసరావు, మండల ప్రత్యేకాధికారి విజయలక్ష్మి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్, డిప్యూటీ ఎంపీడీఓ ఈశ్వర మోహన్ వరద పరిస్థితులను వివరించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ అఖిల మాట్లాడుతూ ధవళేశ్వరం బ్యారేజీ వద్ద మూడో ప్రమాద హెచ్చరికను జారీ చేసే పరిస్థితి ఎదురైనప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. అద్దంకివారిలంక, పల్లపులంక, నారాయణలంక, కేదారిలంక, వీధివారిలంక గ్రామాలు ముంపుబారిన పడే అవకాశం ఉన్నందున ఆయా గ్రామాల్లో మండల స్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో వరదనీరు చుట్టుముడితే తాగునీటి సరఫరా చర్యలను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చేయాలన్నారు. విద్యుత్ సరఫరా సమస్యలు తలెత్తితే అవకాశాల మేరకు వెంటనే సమస్యను పరిష్కరించాలని విద్యుత్ శాఖాధికారులను ఆదేశించారు. అత్యవసరమైతే పాఠశాలలకు సెలవు ప్రకటించేందుకు సిద్ధంగా ఉండాలని విద్యా శాఖాధికారులను ఆదేశించారు.


పునరావాస కేంద్రమైన వాడపాలెం పాఠశాలను పరిశీలిస్తున్న అధికారులు

లంక గ్రామాలు సందర్శన : మండలంలోని ఐదు లంక గ్రామాల్లో మండల ప్రత్యేకాధికారి విజయలక్ష్మి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్, డిప్యూటీ ఎంపీడీఓ ఈశ్వర మోహన్‌లు పర్యటించారు. ఆయా గ్రామాల అధికారులకు పలు సూచనలు చేశారు. వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదించాలని ఆదేశించారు. పునరావాస కేంద్రంగా ఏర్పాటు చేసిన వాడపాలెం ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. కాజ్‌వేలను, లోతట్టు ప్రాంతాల్లో వరదనీటిని పరిశీలించారు. అత్యవసరమైన పంపిణీ చేసేందుకు బియ్యం నిల్వల వివరాలను సేకరించారు.

మరింత పెరిగిన వరద ఉధృతి

కపిలేశ్వరపురం: గౌతమి గోదావరి నది నిండుకుండను తలపిస్తోంది. గురువారం వరద ఉధృతి మరింత పెరిగింది. ఈ నేపథ్యంలో రామచంద్రపురం ఆర్డీఓ డి.అఖిల మండల స్థాయి అధికారులను అప్రమత్తం చేశారు. లంక గ్రామాలకు ఒక్కో మండల స్థాయి అధికారిని ఇన్ చార్జిగా నియమించాలని, వారు లంక గ్రామంలోనే ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆ నేపథ్యంలో తహసీల్దార్ శ్రీనివాస్ లంక గ్రామాలకు అధికారును నియమించారు.

లంక గ్రామాల ఇన్‌చార్జిలు వీరే..

గ్రామం	అధికారి	శాఖ	సెల్ నంబర్
కేదారిలంక	జి శ్రీనివాసరెడ్డి	ఏఈ హౌసింగ్	70939 30492
వీధివారిలంక	కె.తాతారావు	ఎంఈఓ, విద్యాశాఖ	9492479542
నారాయణలంక	బి.రవి,	ఏఓ వ్యవసాయ శాఖ	83310 56560
అద్దంకివారిలంక	పి.రజిత్ సింగ్	ఏపీఓ	77020 73520
పల్లపులంక	ఎస్‌వీరభద్రరాజు	ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్	63007 13319

సురుచిలో గణేష్ మాలధారణ ఉత్సవం


తాపేశ్వరం సురుచి ఫుడ్స్ తయారీ కేంద్రంలో వినాయకుడిని ప్రతిష్ఠిస్తున్న మాలధారులు

కపిలేశ్వరపురం (మండపేట): స్వీట్స్ తయారీలో ప్రసిద్ధి చెందిన మండపేట మండలం తాపేశ్వరంలోని సురుచి ఫుడ్స్ ఆవరణలో గురువారం గణేష్ మాలధారణ ఉత్సవం ప్రారంభమైంది. ఐదుగురు స్వీట్స్ తయారీ మేస్త్రీలు మాలను ధరించారు. గణపతి నవరాత్ర ఉత్సవ శిబిరాల్లో నిర్వాహకులు ప్రసాదంగా ఏర్పాటు చేసే లడ్డూల తయారీని మాలధారులు అత్యంత నియమ నిష్టలతో తయారు చేస్తారు. రోజూ మాలధారులు తమ సంస్థలోని వినాయక మండపంలో పూజలు నిర్వహించి లడ్డూలను తయారు చేయడం ఆనవాయితీగా వస్తోందని నిర్వాహకులు తెలిపారు.

దివ్యాంగులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలి


లావేటి వెంకటేశ్వరరావు

రామచంద్రపురం: ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్త్రీశక్తి పథకంలో దివ్యాంగులను కూడా చేర్చాలని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ దివ్యాంగుల అధ్యక్షులు లావేటి వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మానసిక, శారీరిక ఇబ్బందులు ఎదుర్కొనే దివ్యాంగులకు ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో కొంత రాయితీ ఇస్తున్నారని, ప్రభుత్వం వసూలు చేసే ఛార్జీలను పూర్తిగా రద్దుచేసి ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేసే సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు దివ్యాంగుల ఆత్మ గౌరవమే మా లక్ష్యం అని హామీ ఇచ్చి వారి ఓట్లతో గద్దెనెక్కారని, అధికారం చేపట్టిన ఆరు నెలలకి సదరన్ సర్టిఫికెట్లు రీవేరిఫికేషన్ అంటూ నానా ఇబ్బందులు పెడుతూ కార్యాలయం చుట్టూ తిప్పుతున్నారన్నారు. రాష్ట్రంలో పెన్షన్ పొందుతున్న 8,20,000 మంది దివ్యాంగులను ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ప్రభుత్వం దివ్యాంగులకు న్యాయం చేయాలన్నారు.

అంగన్‌వాడీల ధర్నా


కపిలేశ్వరపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

కపిలేశ్వరపురం: మండపేట ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీలు గురువారం కపిలేశ్వరపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. 2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో తమ వేతనాలను పెంచారని, కూటమి పాలనలో వేతనాలను పెంచే ఆలోచన చేయకపోవడం బాధాకరమని నాయకులు ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు నాయకులు ఎం.బేబీ, ఎం.జానకీదేవి, పి.అనంతలక్ష్మి, పి.మంగాదేవి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2014 తర్వాత తమ వేతనాలను పెంచలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పటినుంచి నేటి వరకూ అనేక సార్లు నిత్యావసర సరుకుల ధరలు పెరిగాయని, తమ వేతనాలు మాత్రం పెరగలేదన్నారు. గతంలో తాము చేసిన 42 రోజుల సమ్మె విరమణ సమయంలో అప్పటి ప్రభుత్వం తమకు వేతనాలను పెంచుతామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఆ హామీని కూటమి ప్రభుత్వం విధిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ శ్రీనివాస్‌కు అందజేశారు.

రాయవరం: దేశవ్యాప్త పిలుపులో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు నల్ల బ్యాడ్జీలతో గురువారం నిరసన వ్యక్తం చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల అంగన్‌వాడీ యూనియన్ నాయకులు ఎస్.కృష్ణకుమారి, డి.ఆదిలక్ష్మి, సీహెచ్.సత్యవేణి, ఎస్.నూకరత్నం, కె.కమల ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు నిరసన తెలిపారు. అంగన్‌వాడీ వర్కర్లకు వేతనాలు పెంచాలని, మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ కేంద్రాలుగా నిర్వహించాలని, గ్రాట్యుటీ జీవోలో మార్పులు చేయాలనే డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ ఐపీ శెట్టికి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

సమస్యలు పరిష్కరించాలి

కె.గంగవరం: ప్రభుత్వం వెంటనే అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన అంగన్‌వాడీ సిబ్బంది కె.గంగవరంలో నిరసన తెలిపారు. తొలుత కె.గంగవరం సెంటర్లో మానవహారం నిర్వహించి నిరసన చేశారు. అనంతరం ర్యాలీగా స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సిబ్బందికి అందించారు. ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ నాయకులు వీరలక్ష్మీ, శ్రీదేవి, వెంకటరత్నం మాట్లాడుతూ అంగన్‌వాడీ యూనియన్స్‌ను చర్చలకు పిలిచి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

రామచంద్రపురం: అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని, ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, గ్రాడ్యువీటీ జీవోలు మార్పులు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలో అంగన్వాడీలు నల్ల చీరలు ధరించి ర్యాలీగా రాజగోపాల్ సెంటర్‌లో మానవహారం చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు. ఎఫ్ఆర్ఎస్ ఇన్, అవుట్ రద్దు చేయాలని, సెంటర్ నిర్వహణకు ట్యాబ్‌లు ఇవ్వాలని, 5జీ నెట్వర్క్ ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. సీఐటీయూ నాయకుడు సత్తిబాబు, అంగన్వాడీ నాయకులు విజయలక్ష్మి పాల్గొన్నారు.


రాయవరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు


రామచంద్రపురం ప్రధాన రహదారిపై ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

క్లుప్తంగా

చవితి ఉత్సవాల్లో నిబంధనలు పాటించాలి

కపిలేశ్వరపురం: గణపతి నవరాత్ర ఉత్సవాలను నిబంధనల మేరకు భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు సూచించారు. అంగర పోలీస్ స్టేషన్‌లో ఎస్సై హరీష్ కుమార్ ఆధ్వర్యంలో మండలంలోని గణపతి నవరాత్ర ఉత్సవాల నిర్వహణ కమిటీ సభ్యులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకునే బాధ్యతను ఉత్సవ నిర్వాహక కమిటీ సభ్యులు తీసుకోవాలన్నారు. ఉత్సవాల ప్రారంభం నుంచి నిమజ్జనం వరకూ ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూసుకునే బాధ్యత నిర్వాహకులదే అన్నారు. ఉత్సవ నిర్వహణలో భక్తిభావం ఉండాలని, రాగద్వేషాలకు తావు ఇవ్వవద్దన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కాజులూరు: మండల గ్రామాల్లో ఈ నెల 27 నుంచి నిర్వహించనున్న గణేష్ ఉత్సవాల నిర్వహణ, మండపాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని గొల్లపాలెం ఎస్సై మోహన్‌కుమార్ అన్నారు. పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ, గణేష్ ఉత్సవాల నిర్వహణలో పందిళ్లు, మండపాల ఏర్పాటుకు చలానా చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఉత్సవాలు నిర్వహించే వారు ఒక కమిటీగా ఏర్పడి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సింగిల్ విండో విధానం ద్వారా అనుమతులు పొందాలన్నారు. గణేష్ ఉత్సవాల్లో అల్లర్లు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు.

భక్తిశ్రద్ధలతో మాస శివరాత్రి పూజలు

రాయవరం: మండలంలోని వెంటూరులో వేంచేసిన ఉమా సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో గురువారం మాస శివరాత్రి పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామి వారికి లక్షపత్రి పూజ చేశారు. పిండిప్రోలు సుబ్బారావు దంపతులు పీటలపై కూర్చుని పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు మద్దిరాల సాయికిరణ్, రుత్విక్కులు వింజమూరి సుబ్రహ్మణ్యం, ఇంద్రగంటి సూరిబాబు, కోరుమిల్లి కామేశ్వరరావు, మైలవరపు సూర్యనారాయణశర్మ పాల్గొన్నారు.

నేలటూరులో..

కపిలేశ్వరపురం: మండలంలోని నేలటూరులో గురువారం మాస శివరాత్రి పూజలు నిర్వహించారు. గ్రామంలోని నీలాంబికా సమేత బసవేశ్వరస్వామి ఆలయ కల్యాణ మండపంలో శివునికి ప్రత్యేక పూజలు చేశారు. దాతల సౌజన్యంతో అన్నదానం నిర్వహించారు. గ్రామంలో 21 సంవత్సరాల ఎనిమిది నెలల నుంచి మాస శివరాత్రి పూజలను చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

జెడ్పీటీసీ కుటుంబానికి జగ్గిరెడ్డి పరామర్శ


జెడ్పీటీసీ కుటుంబాన్ని పరామర్శిస్తున్న జగ్గిరెడ్డి, సూర్యప్రకాశ్

రామచంద్రపురం రూరల్: ఇటీవల మృతి చెందిన రామచంద్రపురం జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి గురువారం పరామర్శించారు. పార్టీ జిల్లా యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ కో–ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్, ఎంపీపీలు అంబటి భవాని, పంపన నాగమణి, ఎంపీటీసీ తుమ్మూరి సుబ్బలక్ష్మి, మండల కో–ఆప్షన్ సభ్యుడు షేక్ అహ్మద్ అలీషా, సర్పంచ్‌లు వీరబోయిన సూరిబాబు, పంపన వీరవెంకటరమణ, పార్టీ నాయకులతో కలసి వెంకటేశ్వరరావు ఇంటికెళ్లారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం భార్య విజయ, కుమారుడు సాయిరామ్, కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ వెన్నుదన్నుగా ఉంటుందని భరోసానిచ్చారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పెమ్మిరెడ్డి మురళీకృష్ణ, మండల అధ్యక్షుడు పోలినాటి వరప్రసాద్, ఏపీఐడీసీ మాజీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యాబోధన శాస్త్రీయ పద్ధతిలో సాగాలి

కపిలేశ్వరపురం (మండపేట): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధన శాస్త్రీయ పద్ధతిలో సాగాలని రామచంద్రపురం డీవైఈఓ ప్రత్తి రామలక్ష్మణ మూర్తి ఉపాధ్యాయులను ఆదేశించారు. మండపేట మండలం వెలగతోడు జెడ్పీ ఉన్నత పాఠశాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదిలో విద్యార్థులతో మాట్లాడి వారి విద్యా స్థాయిని పరీక్షించారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. రికార్డుల నిర్వహణను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఇటీవల నిర్వహించిన ఫార్మేటివ్ అసెస్మెంట్-1 పరీక్షల మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఆయన వెంట హెచ్‌ఎం కొంటెని శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు యేసు రాజు, వీర వెంకట్రావు, వీరభద్రరావు, సాయిబాబు, శ్రీహరి, సఫీర్, వీర్రాజు, కృపామణి, సహదేవుడు, తారకం ఉన్నారు.

లక్ష బిల్వార్చన

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామలో ఉన్న శ్రీమాణిక్యంబ సమేత భీమేశ్వర స్వామి దేవస్థానంలో మాస శివరాత్రి పురస్కరించుకుని స్వామికి సామూహిక లక్ష బిల్వార్చన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ప్రతి మాసంలో వచ్చే మాస శివరాత్రి రోజున ఈ సేవ కొనసాగిస్తామని ఆలయ ఈవో, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గా భవాని తెలిపారు.

అంటు వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

రామచంద్రపురం: వర్షాకాల సీజన్‌లో విద్యార్థులు అంటు వ్యాధులు సోకకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ సూచించారు. కళాశాలలో గురువారం మాన్సూన్ హైజిన్ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, వర్షాకాలంలో వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకొని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటూ తోటివారికి కూడా జాగ్రత్తలు చెప్పాలన్నారు. అందరూ పరిశుభ్రమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలన్నారు.

ఎరువుల గోడౌన్లు తనిఖీ

రామచంద్రపురం: పట్టణంలోని ఎరువుల షాపుల గోడౌన్లను జిల్లా వ్యవసాయ అధికారి బోసు బాబు గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేసి గోడౌన్లలోని ఎరువులను సరిచూశారు. ఆయన మాట్లాడుతూ, రైతులకు ఎరువుల కొరత రాకూడదని, ఎంఆర్‌పీ ధరల కన్నా అధికంగా అమ్మకూడదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే ఎరువుల డీలర్లపై కఠిన చర్యలు తప్పవన్నారు. రైతులందరూ కూడా నానో ఎరువుల మీద అవగాహన పెంచుకోవాలని, వాటి వాడకం ప్రారంభించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు నాగ కుమార్, మండల వ్యవసాయ అధికారి మణిదీప్, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ పద్ధతులు అనుసరించాలి

కె.గంగవరం: ప్రతి రైతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరించాలని ఏఓ సద్గురుమూర్తి అన్నారు. మండలంలోని కుందూరులో గురువారం రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారిస్తే పెట్టుబడి తగ్గడంతో పాటు పంట దిగుబడి పెరిగి ఆర్థికంగా ఎదగొచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కోటి శ్రీను మాట్లాడుతూ, కషాయాలు వినియోగించడం ద్వారా నేల ఆరోగ్యం కాపాడుకొని మంచి పంటను అందిస్తుందన్నారు. అనంతరం కషాయాల తయారీని రైతులకు స్వయంగా తయారు చేసి చూపించారు. కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షుడు కొరిపల్లి శ్రీను, వీఏఏ రేవతి, స్థానిక రైతులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కాజులూరు: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గొల్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారిణి సౌజన్య అన్నారు. గురువారం పీహెచ్‌సీలో జరిగిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. వర్షాల కారణంగా వాతవరణం కలుషితమై అంటు వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. మూడు రోజుల కంటే ఎక్కువ జ్వరం ఉండి, బీపీ తగ్గితే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. కాచి చల్లార్చిన నీరు తాగాలని, మార్కెట్‌లో దొరికే కలుషిత ఆహారాన్ని తినకూడదన్నారు. కార్యక్రమంలో ఎఎన్‌ఎంలు, ఆశా వలంటీర్లు పాల్గొన్నారు.

జారితే అంతే సంగతి!


కాకినాడ- కోటిపల్లి రోడ్డులో ట్రాక్టరుపై సెల్‌ఫోన్ చూస్తూ కూర్చున్న యువకులు

కాజులూరు: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రభుత్వాలు ఎన్ని కట్టుదిట్టమైన చట్టాలు తీసుకువస్తున్నా పలువురు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రమాదపు అంచున ప్రయాణాలు సాగిస్తున్నారు. కాకినాడ– కోటిపల్లి రహదారిలో గురువారం గొల్లపాలెం వద్ద ఓ రైతు ట్రాక్టరుపై తీసుకెళుతున్న ఎరువుల బస్తాలపై ఇద్దరు యువకులు సెల్‌ఫోన్ చూసుకుంటూ నిర్లక్ష్యంగా కూర్చున్న దృశ్యం ‘సాక్షి’ కెమెరా క్లిక్ మనిపించింది. పొరపాటున డ్రైవర్ బ్రేక్ వేస్తే యువకులు జారిపడక తప్పని పరిస్థితి.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కపిలేశ్వరపురం: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో రామచంద్రపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాలరావు గురువారం తెలిపారు. మండల హెడ్ క్వార్టర్స్, ఇండస్ట్రియల్ ఫీడర్ల పరిధిలోని కపిలేశ్వరపుం, పడమర ఖండ్రిక, వెదురుమూడి గ్రామాల్లోని ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రాయవరం: విద్యుత్ లైన్ల మరమ్మతులు, వైర్లపై ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా పసలపూడి రూరల్ ఫీడర్ పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని రామచంద్రపురం ఈపీడీపీసీఎల్ ఈఈ కె.రత్నాలరావు గురువారం తెలిపారు. పసలపూడి రూరల్ ఫీడర్ పరిధిలోని గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. రాయవరం సబ్‌స్టేషన్ పరిధిలోని రా యవరం, వెదురుపాక, వి.సావరం, రాయవరం, పస లపూడి గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

ద్వారపూడిలో...

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం ద్వారపూడి ఫీడర్ పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాలరావు గురువారం తెలిపారు. ద్వారపూడి, కేశవరం, వేములపల్లి, జెడ్.మేడపాడు గ్రామాల్లోని విద్యుత్ లైన్లు వెంబడి చెట్టు కొమ్మలను తొలగించే పనులు నిమిత్తం సరఫరాను నిలిపివేస్తున్నట్టు వివరించారు.